**Banking & Insurence - Islam**
**(Telugu)**

# బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాలు

# ఇస్లామ్

రచన

మౌలానా సయ్యద్ ఆలా మౌదూది (రహ్మ)

అనువాదం

గౌస్ మొహియుద్దీన్

# తొలి మాట

మీ చేతిలోనున్న ఈ చిరు పుస్తకం మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది(రహ్మాలై) చేసిన ఒక ప్రసంగంపై ఆధారపడి ఉన్నది. దీనిని మౌలానా ఒక బహిరంగ సభనుద్దేశించి చేశారు. ఈ ప్రసంగాన్ని అక్షర రూపం ఇవ్వాలని మౌలానా మౌదూది (రహ్మాలై) భావించారు. కానీ అనారోగ్యం కారణాన ఇందుకు సమయాన్ని కేటాయించలేక పోయారు. అయినప్పటికీ ఇందులో మౌలానా వారి మాటలను ఉన్నవి ఉన్నట్లుగా ఏ ఒక్కటి చేజార కుండా ఉండేందుకు కృషి చేయడమైనది. అలాగే వీలైనంత వరకు మౌలానా నోట వెలువడిన పదాలనే ఉంచడ మైనది.

# బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాలు - ఇస్లామ్

నేడు ప్రపంచవ్యాప్తంగా ముస్లిములు నిత్యజీవితంలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారు. వివిధ జీవన రంగాల్లో ఇస్లాం నియమాల ప్రకారం జీవించడానికి అనేక అవరోధాలు, చిక్కుముడులు ఎదురవుతున్నాయి. తమ ధార్మిక విశ్వాసాలకు నిత్యజీవితంలో ఎదురయ్యే వ్యవహారాలకు మధ్య పొంతన ఉండడం లేదు. ధార్మిక ఆదేశాలకు పూర్తిగా వ్యతిరేకమైన దిశలో ప్రపంచ వ్యవహారాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముస్లిములకు విచిత్రమైన సంకటస్థితి ఎదురవుతోంది. తమ ధార్మిక విశ్వాసాల ప్రకారం నడిస్తే పోటీ ప్రపంచంలో స్థానం దక్కడం లేదు. ప్రపంచవ్యవహారాల్లో ఆచరణలో ఉన్న పద్ధతులు పాటిస్తే ధార్మిక విశ్వాసాలకు కట్టుబడడం సాధ్యం కాదు. ఈ దుస్థితికి కారణం స్వయంగా ముస్లిములే అంటే తప్పులేదు. ఒక సుదీర్ఘ కాలం మస్లిములు దీర్ఘనిద్రలో మునిగిపోయి, ప్రపంచవ్యవహారాల్లో తమ స్థానాన్ని కోల్పోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తింది. ఇతరులు ప్రపంచవ్యవహారాలను తమ చెప్పుచేతల్లో తీసుకుని తమ పద్ధతుల ప్రకారం నడిపించారు. కాబట్టి ముస్లిములు తమ దార్మికవిశ్వాసాలపై స్థిరంగా ఉంటూ ప్రపంచ వ్యవహారాల్లో ప్రస్తుతం అమలులో ఉన్న పద్ధతులను పాటించడం అ రెండు పరస్పరం విరుద్ధమైన అంశాలుగా మారాయి. ముస్లిములకు జీవితంలో ప్రతిరంగంలో ఈ సమస్య ఎదురవుతోంది. ఈ చిక్కుముడిని విప్పడానికి ముస్లిములు మూడు పద్ధతులను అనుసరించారు. ఆ పద్ధతులేవంటే..

## మొదటి పద్ధతి

ఇస్లామీయ నియమాలనే మార్చాలని భావించడం. ఇస్లామీయ ఆదేశాలను నిరాకరించాలని లేదా శతాబ్దాలుగా ప్రాచుర్యంలో ఉన్న వివరణలను కాదని కొత్త వివరణలివ్వాలని భావించడం. ఆ విధంగా పాశ్చాత్యులు ఏ నియమాలను పాటిస్తున్నారో వాటికి అనుగుణమైన నియమాలను రూపొందించుకోవాలని తలపోయడం.

ప్రపంచం నలుమూలలా పాశ్చాత్య నియమాలనే అనుసరించాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయి. విద్యావంతులు, మేధావులు చాలా మంది ఈ ప్రయత్నాల్లో నిమగ్నమై ఉన్నారు. పాశ్చాత్యులు ఏది ధర్మసమ్మతం (హలాల్)గా చేసుకున్నారో అదే ధర్మసమ్మతంగా చేసుకోవాలని, వాళ్ళు ఏది నిషిద్ధం చేసుకున్నారో అదే నిషిద్ధం (హరామ్) చేసుకోవాలన్న ప్రయత్నాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి.

## రెండవ పద్ధతి

ఇస్లాంకు వ్యతిరేకమైన విషయాలను ఇస్లాంకు వ్యతిరేకమైనవిగా భావించినప్పటికీ, గత్యంతరం లేదు కాబట్టి జీవితంలో వాటిని అనుసరించక తప్పదని పరిగణించి వాటిని అవలంబించడం. ఇంకో విచిత్రమైన విషయమేమంటే కొన్ని వ్యవహారాల్లో మినహాయింపుగా ఇస్లాం కొందరికి ఇచ్చిన అనుమతిని సాధారణ అనుమతిగా భావించి అందరూ స్వీకరించడం. ఈ విధంగా సర్దుబాట్లు చేసుకుంటూ, లోలోన మధనపడుతూ ఏమీ చేయ లేమన్న అభిప్రాయానికి రావడం వల్ల మనలో మెల్లి మెల్లిగా ధార్మిక స్పృహ అంతమైపోతోంది. మనశ్శాంతి కరువైపోతోంది. ఎందుకంటే ఈ విధానాలు నిషిద్ధమని, హరామ్ అని మనకు తెలుసు. ఆ అపరాధభావన వెంటాడుతోంది. మరోవైపు, నిషిద్ధం అయినప్పటికీ అందులోనే కూరుకు పోవడం. ఈ ధర్మ సంకటాల్లో, మానసికంగా క్రుంగిపోతూ ప్రాపంచిక వ్యవహారాల్లో ఇతర జాతులతో పోటీపడలేని స్థాయికి చేరుకున్నాము.

## మూడవ పద్ధతి

విద్యావంతులు చాలామంది ఈ వైఖరిని అనుసరిస్తూ కనబడతారు. దైవాదేశాలు వీరికి స్పష్టంగా తెలుసు. దైవాదేశాలను ఇతరులకు స్పష్టంగా చెబుతుంటారు. ఉదాహరణకు ఫలానా విషయాలు హరామ్, ఫలానా విషయాలు హలాల్ అని తెలియజేస్తారు. కాని ఒక విషయం హరామ్ అని చెప్పడం మాత్రమే పరిష్కారం కాదు. హరామ్‌కు బదులు హలాల్ ఏదో ప్రత్యామ్నాయాన్ని చూపించాలి. ఈ ప్రపంచ జీవన వ్యవహారాలు నిరాటంకంగా కొనసాగించడానికి వీలుగా ఆ ప్రత్యామ్నాయం ఉండాలి. వాడుకలో ఉన్న విధానాలు హరామ్ అని చెప్పి ఊరుకుంటే చేతులు కట్టేసినట్లే అవుతుంది. అలా చేతులు కట్టేసిన జాతి ఇతరులతో సమానంగా ఈ పోటీ ప్రపంచంలో నిలబడగలుగుతుందా?

ఈ మూడు పద్ధతుల వల్ల ఇస్లామీయ ఆదేశాలకు అనుగుణంగా ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకుని ముందడుగు వేయడం సాధ్యం కాదు. కాబట్టి నాల్గవ పద్ధతి అవసరం. ఆ పద్ధతి ఏమంటే దైవాదేశాలను ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా పాటించడం. నిత్యజీవన వ్యవహారాలన్నింటిని దైవాదేశాలకు అనుగుణంగా నడుపడం. అపసవ్యమైన పద్ధతులను విడిచిపెట్టి మనకు ఉచితమైన, అనుసరణీయమైన, ఆమోదయోగ్యమైన పద్ధతిని అవలంబించడం. అలాంటి పద్ధతి పాటించడం వల్ల ఇతరులకు కూడా దిశానిర్దేశనం చేయగలం. తప్పు పద్ధతులను పాటిస్తున్న ఇతరులకు కూడా మార్గదర్శనం చేయగలం.

ఇలాంటి ధర్మసంకటాలు ఎదురవుతున్న అనేక రంగాల్లో బ్యాంకింగ్ రంగం ఒకటి. ఈ రంగంలో మనం ఎలాంటి పద్ధతి అనుసరించాలన్నది ఈ పుస్తకంలో చర్చిద్దాం.

## బ్యాంకింగ్ & ఇన్సూరెన్స్

మన ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలను విడదీయడం

సాధ్యం కాదు. ప్రపంచంలో వాణిజ్య కార్యకలాపాలు, ఆర్థిక వ్యవహారాలు, ప్రభుత్వాల వ్యవహారాలు, జాతుల వ్యవహారాలు అన్నీ బ్యాంకింగ్ తోను ఇన్సూరెన్స్‌తోను ఏదో ఒకవిధంగా ముడిపడి ఉన్నాయి. వీటికి ప్రత్యామ్నాయం గురించి ఆలోచించడం కూడా సాధ్యంకాని పరిస్థితి ఉంది. అయితే బ్యాంకింగ్ పద్ధతుల గురించి పునరాలోచనలు, సమీక్షలు నేడు జరుగుతున్నాయి. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్‌ల గురించి ఇస్లామీయ నియమాలను తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా నేడు కనబడుతోంది. అనుసరించదగ్గ విధానాల గురించి అన్వేషణ జరుగుతున్నది. ప్రస్తుతం ఉన్న బ్యాంకింగ్ విధానాల దుష్ప్రభావం గురించి కూడా ప్రజలు తెలుసుకున్నారు. కాని వీటికి సరయిన ప్రత్యామ్నాయం వారికి కనబడడం లేదు.

ఈ సందర్భంగా మనం చేయవలసిన పనులు, నా అధ్యయనంలో వచ్చిన అంశాలు మీముందు ఉంచుతాను.

1. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ వ్యవస్థలను ఇస్లామీయ దృక్కోణంలో విశ్లేషించి, వాటి దోషాలను వివరించడం.
2. వీటిని గురించి ఇస్లామీయ ఆదేశాలను విపులీకరించడం.
3. ఈ రెండింటిని ఇస్లామీయ నియమాలపై పున:వ్యవస్థీకరిస్తే వాటి స్వరూప, స్వభావాలు ఎలా ఉంటాయో తెలుపడం.

## బ్యాంకింగ్

బ్యాంకింగ్ అవసరం లేని వారెవ్వరూ నేడు సమాజంలో కనబడరు. వ్యాపార,వాణిజ్యాలకు, పరిశ్రమలకు పెట్టుబడులు సమకూర్చడం, అవసర సమయాలలో ప్రభుత్వానికి కూడా ధనసహాయం అందించడం బ్యాంకింగ్ ప్రాముఖ్యాన్ని చాటిచెబుతోంది. ఇన్సూరెన్స్ పరిస్థితి కూడా ఇదే. ఆకస్మికంగా కలిగే నష్టాలనుంచి వ్యక్తులను, సంస్థలను కాపాడ్డానికి ఇన్సూరెన్స్ ఉపయోగ పడుతోంది. నిజానికి బ్యాంకింగ్ వ్యవస్థ క్రీస్తుపూర్వం రెండువేల సంవత్సరాల

నుంచి ఉన్నట్లు తెలుస్తోంది. ఇన్సూరెన్స్ వ్యవస్థ కూడా చాలా ప్రాచీనమైనదే. మనిషి తన ఇష్టారాజ్యంగా నడచుకోడానికి దైవాదేశాలను లక్ష్యపెట్టని ధోరణి అవలంబించడం వల్ల కొన్ని వ్యవస్థలు మంచిఉద్దేశ్యంతో ప్రారంభమైనప్పటికీ తప్పు విధానాలపై నడవడం చోటుచేసుకుంది. బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాల విషయం కూడా ఇలాంటిదే.

(ప్రస్తుతం అమలులో ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థ ఎలా ఏర్పడిందంటే, ఆర్థిక వ్యవహారాల్లో నిష్ణాతులైన కొందరు, ప్రజలకు వడ్డీ ఆశ చూపించి, ప్రజల వద్ద ఉన్న పొదుపు మొత్తాలను సేకరించడం ప్రారంభించారు. ఇలా సేకరించిన మొత్తాలను వారు తమ స్వంత నియమ నిబంధనల మేరకు వ్యాపార వాణిజ్యాలకు పరిశ్రమలకు తాము నిర్ణయించిన వడ్డీ రేట్లకు రుణాలు ఇస్తున్నారు. ఆ విధంగా నష్టభారాన్ని మోయకుండా కేవలం ఒక నిర్ణీత లాభాన్ని అంటే వడ్డీని పొందే అవకాశాలు పొందుతున్నారు. దీని వలన తెలిసే విషయమేమిటంటే, వీరు తాము రుణాలు ఇస్తున్న ఆయా సంస్థల్లో భాగస్వాములుగా ఉండడం లేదు. ప్రజల నుంచి వడ్డీ ఇస్తామని సేకరించిన మొత్తాన్ని అధికవడ్డీకి ఇతరులకు అప్పులు ఇస్తున్నారు.)

## ఇన్సూరెన్స్

ప్రస్తుత పెట్టుడీదారీ వ్యవస్థను నిలబెట్టిన రెండవ మూలస్తంభం ఇన్సూరెన్స్. ఈ వ్యవస్థలో కొందరు వ్యక్తులు ప్రమాదాల వల్ల కలిగే నష్టాన్ని తాము పూరిస్తామనే హామీ ఇచ్చి ప్రజల నుంచి డబ్బును ప్రీమియంగా వసూలు చేసి, దానిని వడ్డీపై ఇతరులకు సమకూరుస్తారు. ఈ విధంగా చూస్తే వ్యక్తుల మధ్య లేదా కంపెనీల మధ్య జరిగే ఇన్సూరెన్స్ వ్యవహారాలు ఒక విధంగా జూదం వంటివి. ఇది జూదంతో ఆరంభమై వడ్డీతో ముగుస్తుంది. ఏదేని ప్రమాదం సంభవిస్తే ఒక నిర్ణీత మొత్తాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించాలి అనే ఒప్పందం వ్యక్తితో చేసుకుంటుంది. కంపెనీకి ఎంత సొమ్ము వసూలైనది అనే

అంశాన్ని పూర్తిగా విస్మరిస్తూ ఈ వ్యవహారం జరుగుతుంది. కావున ఇది నిస్సందేహంగా పూర్తిగా జూదమే అవుతుంది. వీటిని గురించి కొన్ని న్యాయస్థానాల తీర్పుల గురించి, జూదం నిర్వచనం గురించి ఇన్సూరెన్స్‌కు జూదానికి మధ్య ఉన్న సంబంధం గురించి ఇక్కడ చూద్దాం

## థేకర్ వర్సెస్ హార్డీ వ్యాజ్యంలో లార్డ్ జస్టిస్ కాటన్ అభిప్రాయం

వాస్తవానికి జూదంలో పాల్గొనే ఇరువర్గాలలో ఒకరి విజయం మరి యొకరి పరాజయం ఒప్పందం జరిగే సమయంలో అస్పష్టంగా ఉండి భవిష్యత్తులో స్తంభించబోయే ఒక ఘటనపై ఆధారపడి ఉంటుంది. ఒప్పందాన్ని పూర్తి చేయడం లేదా దానికి లోబడి నడుచుకోవడం పూర్తిగా అదృష్టంపై ఆధారపడి ఉండడాన్ని చట్టం అభిలషించదు. ఇన్సూరెన్స్ వ్యవహారాల్లో కూడా ఇలాంటి అనిశ్చితమైన అంశాలు చాలా వరకు ఇమిడి ఉన్నాయి. ఒక వ్యక్తి మృత్యువు నిశ్చితమైన విషయం. కాని ఆ వ్యక్తి ఎప్పుడు మృతి చెందుతాడు అనే విషయం అనిశ్చితమైనది. మరి ఈ నియమం ప్రకారం ఒక జీవిత బీమా పాలసీ కేవలం రెండు విడతల ప్రీమియం చెల్లింపునకే పాలసీ మొత్తం వసూలు కాగలదు. అదే విధంగా అగ్ని ప్రమాదం జరగడం లేదా ఒక దుర్ఘటన సంభవిస్తుందా లేదా అనే విషయం కూడా పూర్తిగా అనిశ్చితమైనదే. కానీ ఒక వ్యక్తి వీటి మూలంగా కంపెనీ నుండి నష్ట పరిహారాన్ని కోరే హక్కును పొందుతాడు.

## సాల్ట్ వ్యాజ్యం-నార్త్ హంప్టన్ లో లార్డ్ బ్రేమూల్ వ్యాఖ్యలు

ప్రతి జీవిత బీమా ఒక రకమైన జూదం వంటిది. ఇందులో వ్యక్తి ప్రతి సంవత్సరం 60 పౌండ్లు చొప్పున పందెం వేయడం జరుగుతుంది. పందెం ఏంటంటే, ఒకవేళ అతను చనిపోతే కొందరు వ్యక్తులకు 1000 పౌండ్లు ఇవ్వాలి. ఇందులో అతను తొందరగా చనిపోతే గెలుస్తాడు. ఆలస్యంగా చనిపోతే ఓడిపోతాడు.

జస్టిస్ ఫూల్టన్ ఒక తీర్పులో రాసిన మాటలు..

ఒక ఒప్పందంలో ఒక వ్యక్తి మరొ వ్యక్తికి ఒక నిర్ణీత కాలంలో తాను మరణిస్తే ఒక భారీమొత్తాన్ని రెండవ వ్యక్తికి చెల్లించాలన్న షరతుపై ప్రతి సంవత్సరం ఒక నిర్ణీత మొత్తాన్ని చెల్లిస్తాడు. అలాగే మరియొక వ్యవహారంలో ఒక గుర్రం ఇతర గుర్రాల్ని పరుగులో అధిగమిస్తే ఒక పెద్ద మొత్తాన్ని చెల్లించాలన్న షరతుపై కొంత మొత్తాన్ని ఇస్తాడు. ఈ రెండు వ్యవహారల్లో ఎలాంటి భేదం ఉందో చెప్పడం చాలా కష్టం

ఇన్సూరెన్స్ మూల లక్షణాలు పైనుదాహరించిన కోర్టు తీర్పుల ద్వారా సవివరంగా తెలుస్తున్నాయి. ఐనప్పటికీ కొన్ని భారత, యూరప్ న్యాయ స్థానాలు ఇన్సూరెన్స్, జూదం ఈ రెంటి మధ్య ఉన్న తేడా చూపడానికి కృషి చేశాయి. ఆ తేడాలు ఏవంటే..

1. ఏదైనా ప్రాణి లేదా సంపద విషయంలో ప్రత్యేక ఆసక్తి సరయిన కారణాల రీత్యా ఉంటే అది ఇన్సూరెన్స్ వ్యవహారం. ఒకవేళ ఏదేని అనుచిత కారణాల రిత్యా ఉంటే అది జూదం.

ఈ తేడా చాల సూక్ష్మమైనది, సున్నితమైనది. బుద్ధికి అందనిది. అసలు వ్యవహారం నియమాల ప్రకారం ఇన్సూరెన్స్‌లో ఒక వ్యక్తికి కలిగే లాభం లేదా ఒకరి నుంచి మరొకరికి ధనం చేరడం జూదంలా యాధృచ్ఛిక మైనది.

కాబట్టి మనకు తెలిసినదేమంటే, బ్యాంకింగ్ మూలపునాది వడ్డిపై ఉంది. ఇన్సూరెన్స్ పునాది జూదంపై ఉంది.

## ఇస్లాం ఆదేశాలు

దివ్యఖుర్ఆన్ జూదాన్ని నిషేధించింది. ఒక్క ఇస్లాం మాత్రమే కాదు, ప్రపంచంలో మతాలు, నైతిక నియమాలన్నీ దీనిని నిషేధించాయి. దీన్ని ధర్మసమ్మతంగా పేర్కొన్న మతం దైవధర్మం కాదు. అదేవిధంగా వడ్డీ యూద మతం, క్రైస్తవం, ఇస్లాం మూడు ధర్మాలలో కూడా అధర్మమైన వ్యవహారం.

యూదులు తమ ధర్మాన్ని మార్చి మరొక యూదుడి నుండి వడ్డీ తీసుకొనుట నిషేధం, కానీ ఒక యూదేతరుడి వద్ద వడ్డీ తీసుకొనుట ధర్మసమ్మతం చేశారు. దైవధర్మం ఒక వ్యక్తి లేక సముదాయం లాభాన్ని మాత్రం కోరదు. ఇందుకు భిన్నంగా అది మానవ సంతతి యావత్తు శ్రేయం కొరకు పనిచేస్తుంది. దైవ ధర్మం ఒకే కార్యాన్ని ఒక జాతికి ధర్మసమ్మతంగాను మరొక జాతికి నిషిద్ధం గాను ఎలా నిర్ణయిస్తుంది. క్రైస్తవం గురించి తెలిసిన విషయం ఏమిటంటే అది వడ్డీని నిషేధించింది. ఇక ఇస్లాం 'వడ్డీ'కి సంబంధించిన ఎలాంటి పద్ధతినైనా ఆమోదించదు. దానిని సంపూర్ణంగా నిషేధించినది. ఋణం వ్యక్తిగత అవస రాల కోసం లేక వ్యాపార అవసరాల నిమిత్తం లేదా సంక్షేమ కార్యక్రమాలకు గాని ఎలాంటి పరిస్థితులలోను 'వడ్డీ'మాలిన్యం నుండి దూరంగా ఉండాలని ఇస్లాం ఆదేశిస్తుంది.

## ఒక ఆకర్షణీయమైన వాదన

కానీ ఇటీవలి కాలంలో కొందరు ఒక విభిన్నమైన వాదనను లేవ నెత్తారు. అదేమిటంటే వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఋణం తీసుకోవటం, వ్యాపార నిమిత్తం ఋణం తీసుకోవటం ఈ రెండు సందర్భాలు విభిన్నమైన అంశాలు అని సెలవిస్తున్నారు. కానీ దైవగ్రంథమైన ఖుర్‌ఆన్‌లోని 'వడ్డీ'కి సంబంధించిన నిషేధాజ్ఞగల ఈ క్రింది వాక్యాన్ని చదివితే పై వాదనకు ఎలాంటి ఆస్కారం ఉండదు.

> **"విశ్వసించిన ప్రజలారా! మీరు నిజంగా విశ్వాసులే అయితే, అల్లాహ్‌కు భయపడండి, ఇంకా మీకు ప్రజల నుండి రావలసిన వడ్డీని విడిచిపెట్టండి. కాని ఒకవేళ మీరు అలా చెయ్యకపోతే, మీపై అల్లాహ్ తరపు నుండి ఆయన ప్రవక్త తరపునుండి యుద్ధ ప్రకటన ఉంది అనే విషయం తెలుసుకోండి. ఇప్పుడైనా మీరు పశ్చాత్తాపపడితే (వడ్డీని వదులుకుంటే) అసలు సొమ్ము తీసుకోవటానికి హక్కుదారులవుతారు. మీరూ అన్యాయం చెయ్యకూడదు, మీకూ అన్యాయం జరగకూడదు.**

**మీ బాకీదారుడు ఆర్థిక ఇబ్బందులలో ఉంటే, అతని పరిస్థితి మెరుగు పడే వరకు గడువు ఇవ్వండి. లేక మీరు తెలిసినవారే అయితే, ఆ బాకీని అతనికి దానం చెయ్యండి. అది మీకు ఎక్కువ శ్రేయస్కరం."**

**(అల్ బఖర: 278-280)**

పై పదాల నుండి తెలిసే మొదటి విషయం ఋణానికి సంబంధించిన వడ్డీ గురించి తెలుపబడింది. రెండవ విషయం 'మీరు తౌబా (పశ్చాత్తాపబడితే) (వడ్డీని వదులుకుంటే) అసలు సొమ్మును తీసుకోవటానికి హక్కుదారులవు తారు." ఈ వాక్యం నుండి తెలిసే విషయం ఏమిటంటే, ఋణ వ్యవహారాలలో అసలు పైకంకంటే అధికంగా తీసుకొనేదంతా వడ్డీయే. దీని విషయంలోనే క్షమాపణ కోరి 'తౌబ' (పశ్చాత్తాపం) చేసుకోవాలని హితవు చేయబడింది.

ఇదే సూరా బఖరాలోని తొలి వాక్యాలలో (వాక్యాలు 273 నుండి 275) "ప్రజలు వ్యాపారంలో కలిగే ఆదాయం కూడా వడ్డీ ద్వారా లభించే ఆదాయంలాంటిదే" అని అంటారు.

అందుకు సమాధానంగా ఆ సర్వోన్నతుడైన దేవుడు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మ సమ్మతం (హలాల్) చేశాడు. వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు. కేవలం ఋణం ఇచ్చి అందుకు బదులుగా లాభాన్ని పొందే హక్కును ఇవ్వలేదు. ఈ నియమాన్ని దివ్యఖుర్‌ఆన్‌లో చాలా స్పష్టంగా నిర్ణయించడమైనది. మరి ఇందులో ఎక్కడా వ్యక్తిగత అవసరాల నిమిత్తం తీసుకొనే ఋణాలకు ఒక నియమం, వ్యాపార అవసరాల నిమిత్తం తీసుకునే ఋణాలకు మరొక నియమంలాంటి అవకాశాన్ని వదలలేదు.

## నిరాధార వాదన

మరికొందరు దివ్యఖుర్‌ఆన్ పదాలు 'మీరు పీడించకండి, మీరు పీడించబడరు' నుండి ఒక వాదన చేస్తారు. అదేమంటే; కేవలం వడ్డీరేటు నిర్ణయంలో జరిగే అన్యాయం విషయంలో మాత్రమే ఈ ఆదేశం ఇవ్వబడినదని

కానీ ఈ పదాల యొక్క సందర్భాన్ని చూసినప్పుడు ఈ నిర్ధారణ సమూలంగా అసత్యమని ఇట్లే గ్రహించగలం. దివ్యఖుర్ఆన్ ఏదేని వాక్యాన్ని అర్థం చేసుకో వలెనన్న దాని అవతరణా సందర్భాన్ని తప్పక దృష్టిలో ఉంచుకోవాలి. ఒకవేళ సందర్భాన్నుండి వేరుచేస్తే అది గ్రంథ అనుసరణ అనిపించుకోదు కేవలం వక్రీకరణే అవుతుంది. అలాగే ప్రస్తుత వాక్య అవతరణా సందర్భం వల్ల ప్రస్ఫుటమయ్యేదేమిటంటే, అల్లాహ్ దృష్టిలో ఋణగ్రస్తుడిపై జరిగే అన్యాయం అతని నుండి అసలు ధనంకంటే అధికంగా వసూలు చేయడం. మరి ఋణ దాతకు అన్యాయమేమిటంటే అతని అసలు ధనం కూడా లభించకపోవడం. పూర్వకాలం నుండి నేటివరకు దివ్యఖుర్ఆన్ వ్యాఖ్యానకర్తలందరూ ఈ వాక్యం అర్థాన్ని (నిస్సందేహంగా) దీనినే తీసుకున్నారు. ఆది నుండి నేటి వరకు దివ్య ఖుర్ఆన్ వ్యాఖ్యానకర్తలందరూ నా వాదననే బలపరుస్తున్నారు. హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్(రజిఅన్), ఇబ్నె కసీర్(రహ్మాలై), షౌకానీ (రహ్మాలై) మరియు నేటికాలపు ఖుర్ఆన్ వ్యాఖ్యానకర్త ముఫ్తీ అబ్దహ్(రహ్మాలై) కూడా వీరిలో ఉన్నారు.

## మరొక వాదన

మరొక వాదన ఎలా ఉందంటే, అరబ్ ప్రాంతంలో ఖుర్ఆన్ అవతరణ కాలంలో ఋణాలు కేవలం వ్యక్తిగత అవసరాల కొరకు ఇవ్వబడేవి. పారి శ్రామిక, వ్యాపార ఉద్దేశాలకు ఇతర ప్రయోజనకరమైన కార్యాలలో ఉపయోగించే సంప్రదాయం లేదు. కావున 'రిబా' (వడ్డీ) వ్యక్తిగత అవసరాలకు తీసుకొనే ఋణాలపై మాత్రమే అధర్మమైనదిగా, హరామ్‌గా నిర్ణయించ బడినది. అభివృద్ధి పనులు లేదా ప్రయోజనకరమైన కార్యకలాపాల కొరకు ఉద్దేశించిన ఋణాలపై వడ్డీ ఈ కోవలోకి రాదు అని వాదిస్తారు. కానీ, కాస్త గమనిస్తే ఇలా వాదించేవారి దృష్టిలో దేవుడు సర్వం చూసేవాడు, తెలిసిన వాడు, వినేవాడు, ఆది అంతముల జ్ఞానంగల ఆ దేవుడు కాడేమో? (నవూజు బిల్లాహ్). కేవలం వర్తమాన పరిస్థితులు, అరబ్బుల వ్యవహారాలు మాత్రమే

దేవుడికి తెలుసా? గతంలో ఏమి జరిగిందో, భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలియనివాడా దేవుడు?

ఖుర్‌ఆన్ అవతరణా కాలంలో ప్రపంచంలో మరీ అరబ్ దేశాలకు సరిహద్దులలో ఉన్న దేశాలలోనూ వాణిజ్య ఋణాల ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం ఉండేది. వాటిపై వడ్డీ కూడా తీసుకునేవారు. అరబ్బు ప్రాంతంలో ఈ వ్యవహా రాలు జరిగేవి కాదని చెప్పడం అసమంజసం, అవాస్తవం. అరబ్బుల చరిత్ర మనకు తెలుపుతున్న విషయం ఏమంటే ప్రపంచ దేశాలన్నింటితో అరబ్బులకు వాణిజ్య సంబంధాలుండేవి. చైనా, భారత్, యూరప్, ఆసియా దేశాలలో అధికభాగం వ్యాపారం అరబ్బుల చేతిలో ఉండేది. అరబ్బు పొరుగు దేశాలైన బాబిలోనియా, ఈరాన్, పాలస్తీనా, రోమ్, గ్రీకు దేశాలలో దివ్యగ్రంధం ఖుర్‌ఆన్ అవతరణకు వేల సంవత్సరాల పూర్వమే వాణిజ్య, వ్యాపార ప్రభుత్వ ఋణాలు ఇచ్చిపుచ్చుకోవడం జరుగుతూ ఉండేది. వీటిపై వడ్డీ వసూలు చేసే వారు. అరబ్బులకు ఈ దేశాలన్నింటితో వాణిజ్య సంబంధాలుండేవి. ప్రపం చంలోని ఒక విశాల భూభాగం వ్యాపార వాణిజ్యాలు చేతిలో ఉన్న అరబ్బులు వ్యాపార లావాదేవీల కారణంగా వివిధ దేశాల వ్యాపార విధానాలను పూర్తిగా అవగాహన చేసుకునేవారు. క్రీస్తుపూర్వం 2500 సంవత్సరాల నుండి ఒక వాణిజ్య రహదారి అరబ్బుల ఆధీనంలో ఉండేది. అందులో అద్న్ ఓడరేవు నుండి వాణిజ్య సరుకులను తీసుకొని అఖ్‌బాకు చేరవేసేవారు. కావున అరబ్బులు తమ సమకాలీన ప్రపంచ వాణిజ్య వ్యవహారాల జ్ఞానం లేనివారని ఏ విద్యావంతుడు అనలేడు. మరిన్ని విషయాలను వివరించే ముందు నా వాదనకు కొన్ని ఆధారాలు మీముందు ఉంచుతున్నాను.

'ఏ స్టోరీ ఆఫ్ సివిలైజేషన్స్'లో విల్ డ్యూరాంట్ బాబిలోనియా గురించి రాస్తూ అక్కడ చట్టప్రకారం నగదు ఋణాలపై 20శాతం, ధాన్యంపై 33శాతం వడ్డీ నిర్ణయించబడింది. కొన్ని శక్తివంతమైన వంశాలు తరతరాలుగా వడ్డీ

వ్యాపారాన్ని నిర్వహించేవి. వ్యాపారులకు వడ్డీపై రుణాలిచ్చేవారు. వీరితోపాటు మందిరాల పూజారులు పంటల కొరకు జమీందారులకు రుణాలిచ్చేవారు.

ఇన్ని సాక్ష్యాధారాలుండగా అరబ్బులకు ఈ వడ్డీ విధానాల గురించి తెలియదని మనం ఎలా చెప్పగలం. వారు వాణిజ్య వడ్డీల గురించి తెలియని వారని, రుణాలు వ్యక్తిగత అవసరాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాల కొరకు కూడా తీసుకోవచ్చుననే అంశం తెలియదని ఎలా విశ్వసించగలం?

అంతెందుకు స్వయాన దైవప్రవక్త ముహమ్మద్(స) వారి జీవిత కాలం లోని విషయం, రోమన్ రాజు ఖైసర్ క్రీ.శ. 623లో ఈరాన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధముల కాలంలో చర్చిలనుండి వడ్డీపై రుణాన్ని తీసుకున్నాడు. ప్రభుత్వాలు కూడా రుణాలు తీసుకుంటాయని అప్పటి అరబ్బులకు తెలుసు. హునైన్ యుద్ధం సమయంలో మహాప్రవక్త ముహమ్మద్(స)వారు అబ్దుల్లా బిన్ అబీ రబియ మగ్‌జూబ్ (అల్లాహ్ అభిశాపానికి గురైనవాడు) నుండి నలభైవేల దిర్హములు రుణంగా తీసుకున్నారు. యుద్ధం నుండి తిరిగి వచ్చిన తరువాత తిరిగిచెల్లించారు. రుణాలు వ్యక్తిగత అవసరాలతోపాటు ఇతర ఆవశ్యకతల దృష్ట్యా కూడా తీసుకునేవారు.

వ్యాపార వాణిజ్యాల నిమిత్తం రుణాలు తీసుకొనే సంప్రదాయం అరబ్బుల్లో ఉండేదని సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు హజ్రత్ ఉస్మాన్(రజి) అలా బిన్ అబ్దుర్రహ్మాన్ తాతగారికి రుణంపై వస్తువులు ఇచ్చే వారు. తద్వారా ఆయన వ్యాపారం చేయగా వచ్చే లాభం ఇద్దరికి లభించేది. మరొక దృష్ట్యాంతం ఏమంటే అబ్దుల్లాహ్ (రజిఅన్), ఉబైదుల్లాహ్ (రజిఅన్)లు హజ్రత్ ఉమర్ (రజిఅన్) వారి ఇద్దరు కుమారులు సైనిక పరమైన బాధ్యతలను నిర్వర్తించడానికి ఇరాక్ వెళ్ళారు. మదీనాకు తిరుగు ప్రయాణంలో వస్తుండగా బస్రా గవర్నర్ హజ్రత్ అబూ మూసా అష్ అరి (రజిఅన్) వీరితో ఇలా అన్నారు. "బైతుల్ మాల్ (రాజ్య ఖజానా) మొత్తం నుండి కొన్ని వాణిజ్య సరుకులు తీసుకోండి. మదీనా వెళ్ళి వాటిని అమ్మివేయండి. అసలు మొత్తాన్ని అమీరుల్ మోమినీన్‌కు ఇచ్చివేయండి. మరీ అందులో కలిగే లాభం మీకు

లభిస్తుంది" అని అన్నారు. వారి సూచన ప్రకారంగా అలాగే చేశారు. అసలు మొత్తాన్ని బైతుల్ మాల్‌లో జమ చేసే సందర్భంలో హ|జత్ ఉమర్ (రజిఅన్) వారికి జరిగిన వృత్తాంతాన్ని వివరించారు. అప్పుడు ఆయన సైన్యంలోని అందరితో అబూ మూసా (రజిఅన్) ఇలానే వ్యవహరించారా? అని ప్రశ్నించారు. సమాధానంగా వారు లేదని అన్నారు. అప్పుడు ఆయన ఇలా ఆదేశించారు. ఈ అవకాశం అమీరుల్ మోమినీన్ గారి కుమారులు కాబట్టి మీకు మాత్రమే లభించింది. కావున మీరు ఆర్జించిన లాభం కూడా బైతుల్ మాల్ ధనాగారంలో జమ చేయండని అన్నారు. ఈ విషయంపై హ|జత్ అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) వారు ఏమీ మాట్లాడలేదు. కానీ హ|జత్ ఉబైదుల్లాహ్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) వారు ఇలా అన్నారు. అమీరుల్ మోమినీన్ మీరు ఇలా చేయలేరు. ఒకవేళ బైతుల్ మాల్ ధనంలో ఏదైనా నష్టం కలిగితే అందుకు మేము బాధ్యులముగా ఉండి మొత్తం డబ్బును జమ చేసేవాళ్ళము కదా. కానీ ఉమర్ (రజిఅన్) వారు తమ ఆదేశంలో ఎలాంటి మార్పు చేయలేదు. అప్పుడు అక్కడున్న ఓ వ్యక్తి అమీరుల్ మోమినీన్ తమరు ఈ వ్యవహారాన్ని 'ఖురాజ్' (చట్టపరమైన భాగస్వామ్యం ఇందులో ఒకరి పెట్టుబడి, రెండవ వ్యక్తి శ్రమ ఉంటాయి)గా నిర్ణయిస్తే సవ్యంగా ఉంటుంది అన్నాడు. హ|జత్ ఉమర్ (రజిఅన్) జవాబుగా ఇలా అన్నారు. 'నేను ఈ వ్యవహారాన్ని "ఖురాజ్" గానే పరిగణిస్తాను. లాభంలో సగ భాగాన్ని బైతుల్‌మాల్ ధనాగారంలో జమ చేయండి. మిగిలిన సగం మీరు తీసుకోండి. పై వృత్తాంతం ఆధారంగా చూస్తే అరబ్బు దేశాల్లో రుణాలు కేవలం వ్యక్తిగత అవసరాలకే ఇచ్చేవారని అనడం అజ్ఞానం. అసలు వస్తువులకు అధికంగా ఇచ్చే (మొత్తాన్ని, వస్తువులను) మనం వడ్డీగానే పరిగణించాలి. ఈ వ్యవహారం ఏ ఉద్దేశ్యాలను దృష్టిలో ఉంచుకొని నిర్వహించినను దివ్యఖుర్‌ఆన్‌లో వడ్డీని అధర్మమైనదిగా నిషేధించడమైనది.

## ప్రత్యామ్నాయ ప్రతిపాదన

ప్రస్తుతం ఇండోనేషియా నుండి మొరాకో వరకు ఎన్నో స్వతంత్ర

ముస్లిం దేశాలున్నాయి. వీటి వద్ద వనరులు, సాధనా సంపత్తి కొదవా లేదు. మరీ ప్రత్యేకించి మధ్యప్రాచ్య చమురు సంపద లెక్కించలేనంతగా ఉన్నది. ఇతర ముస్లిం దేశాలు కూడా సంపదలేని దేశాలుగా చెప్పలేము. ఒకవేళ ఈ దేశాలన్నీ కలసికట్టుగా ఒకే అభిప్రాయం ప్రకారం ఒక ఆర్థిక విధానాన్ని తమ నియమాలకు అనుగుణంగా రూపొందించినట్లయితే దీనిని మనం కార్యరూపంలోకి తేవడమేకాదు, అనేక సమస్యలకు ఒకే సమాధానం లభించగలదు. అంతేకాదు బ్యాంకింగ్ వ్యవస్థను వడ్డీ ప్రాతిపదికపై కాకుండా, లాభం ఆధారంగా (Profit & Loss sharing Ratio) విజయవంతంగా నడిపించగలం.

వాస్తవం ఏమిటంటే వడ్డీ ఆధారంగా బ్యాంకింగ్ నిర్వహించడమే సరైనది కాదు. ఇందుకు బదులుగా వడ్డీ ఆశ చూపించకుండానే బ్యాంకర్లు ప్రజల పొదుపు మొత్తాన్ని 'మీరు స్వయంగా ఒక పరిశ్రమను లేదా వ్యాపారాన్ని నడుపలేనప్పుడు వ్యాపారం మేము చేస్తాము, మీకు నిర్ణీతనిష్పత్తిలో లాభాన్ని ఇస్తాము. అని ఈ విధంగా సేకరించిన మొత్తాన్ని వ్యాపారంలో వెచ్చించేందుకు ముందుకు వస్తే అక్కడ వ్యవహారాన్ని వడ్డీపై కాకుండా, వ్యాపార లాభంలో భాగస్వామ్యం ప్రాతిపదికన నడుపవచ్చు. లాభం ఆధారంగా మన ఆర్థిక వ్యవస్థ ఎంతో సలక్షణంగా నడవగలదు. వడ్డీ ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థ కంటే ఈ విధానంలో మనకు ఇంకా ఎన్నో శ్రేయోశుభాలు ఉంటాయి. దీనికారణంగా పొదుపు చేసే వ్యక్తికి, బ్యాంకుకు వ్యాపారం చేసే వాడికి ముగ్గురికి సమానంగా లాభం లభిస్తుంది. ప్రస్తుతం వడ్డీపై ఆధారపడిన విధానంలో ఉత్పత్తిదారులు వడ్డీపై రుణాలు తీసుకుంటారు. వీరికి లాభపు ఎలాంటి గ్యారంటీ ఉండదు, కానీ డబ్బును రుణంగా సమకూర్చినవాడు (రుణదాత) తన లాభం వాటాను ఒక నిర్ణీత శాతంలో గ్యారంటీగా పొందు తాడు. ఈ వ్యవహారంలో పెట్టుబడిదారుడికి (రుణదాతకు) లాభం రావడం, అందుకు ఒక ప్రత్యేక గ్యారంటీ ఉండటం ఇతరులకు లేకపోవటం అనేది ఎంతవరకు సమంజసం? శ్రమ చేసేవారు లాభంలో ఉన్నా లేకపోయినా పెట్టుబడిదారులు మాత్రం

తన లాభాన్ని వసూలు చేసుకోవచ్చు. ఈ వ్యవస్థను లాభంలో భాగం అనే నియమంపై నిర్వహిస్తే ఈ అన్యాయం సమసిపోతుంది. పరిశ్రమలకు, వ్యాపారాలకు ఎంతో అభివృద్ధి లభిస్తుంది. వాణిజ్యం వల్ల పెట్టుబడిదారుడి ప్రయోజనాలు ముడిపడితే వాణిజ్యానికి అవసరమైన సందర్భా లన్నింటిలో అతను తన ఇనుప పెట్టెను తెరిచి ఉంచుతాడు. ప్రతి సంవత్సరం తన వాటా లాభాన్ని వసూలు చేయటానికి బదులుగా వాణిజ్యం అభివృద్ధికి అది నిలదొక్కుకునే అవకాశాన్ని కల్పిస్తాడు. వాస్తవానికి వడ్డీ ఆధారిత వ్యవహా రాలలో తీరు ఇందుకు భిన్నంగా ఉంటుంది. వ్యాపార స్థితిని గురించి ఆలోచిం చక మొదటి నుంచే తన ఆదాయాన్ని వసూలు చేయటం మొదలుపెడతాడు. ఒకవేళ వాణిజ్యానికి పెట్టుబడి తప్పనిసరైన సందర్భాల్లో విశాల హృదయంతో డబ్బును సమకూర్చటానికి బదులుగా వడ్డీ రేట్లను హెచ్చువేసి తన ప్రత్యేక షరతులను ఒప్పించి పెట్టుబడిని సమకూరుస్తాడు.

దేశ శ్రేయస్సు నిమిత్తం ప్రభుత్వం సేకరించే రుణాల విషయంలో కూడా ఈ పద్ధతి వల్ల దేశాభివృద్ధి జరుగుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న వడ్డీ వ్యవస్థలో పెట్టుబడి సమకూర్చేవాడు డబ్బు ఇచ్చి వడ్డీని వసూలు చేస్తాడు. దీనివల్ల అతడు లాభంలో ఉంటాడు కానీ పేద ప్రజలు ఇందుకు భిన్నంగా నష్టానికి గురవుతారు. వడ్డీ సొమ్మును టాక్సుల రూపంలో ప్రజల నుండే వసూలు చేస్తారు. ప్రభుత్వం ఈ డబ్బు ద్వారా దేశరక్షణ కార్యకలాపాలు నిర్వహించినప్పుడు కూడా, ప్రజలు ప్రాణత్యాగాలు చేస్తున్న పరిస్థితిలో కూడా వడ్డీ ఖచ్చితంగా లభిస్తుంది. అతనికి సంవత్సరాల తరబడిగా తన అసలుపై వడ్డీ లభిస్తుం టుంది. వాస్తవానికి ఈ వ్యవహారం ఆద్యంతం న్యాయానికి వ్యతిరేకమైనది.

బ్యాంకింగ్ వ్యవహారాల్లో వడ్డీలేని పద్ధతే ఉత్తమమైంది. కానీ ప్రజలు తమ వెసులుబాటు కొరకు ప్రస్తుత నిషిద్ధ పద్ధతినే ధర్మసమ్మతంగా చేసుకోవా లనుకుంటున్నారు. కృషిచేయడం, అన్వేషించడం అనే శ్రమనుండి తప్పించు

కొని ధర్మబద్ధమైన ప్రత్యామ్నాయ పద్ధతి నుండి దూరంగా ఉంటున్నారు.

## ఇన్సూరెన్స్‌కు ప్రత్యామ్నాయ విధానం

ఇన్సూరెన్స్ దాని ఆశయాలకు సంబంధించి దానివల్ల కలిగే ప్రయోజనాలకు సంబంధించినంతవరకు మనం దానిని నిరాకరించలేము. ప్రమాదాలు సంభవించినప్పుడు వాటివల్ల కలిగే నష్టాలను పూరించే ఒక సంస్థ ఉండటం ఎంతో ఆవశ్యకం. కానీ ఇందుకు జూదంపై ఆధారపడి నడిచే ఇన్సూరెన్స్ వ్యవస్థను అనుసరించడం సరికాదు. ఇన్సూరెన్స్‌ను ఇస్లామీయ నియమాలకనుగుణంగా ఎలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలంటే వాటిలో పాల్గొనే ప్రతి వ్యక్తి తనకు లేదా తనవారికి ఏదైనా నష్టం సంభవించిన దాని పరిపూర్తి నిమిత్తం ఒక నిర్ణీత మొత్తాన్ని ఎడతెగకుండా చెల్లిస్తూ ఉండాలి. ఎవరికి నష్టం కలిగితే వారు దానినుండి లబ్ధిపొందాలి. మరెవరికి నష్టం కలుగలేదో వారు తాము చెల్లించిన మొత్తాన్ని తిరిగి పొందాలని భావించరాదు.

ఇలా ఇన్సూరెన్స్ జూదం నుండి సంపూర్ణంగా శుద్ధి పొందగలదు. సేకరించిన ధనాన్ని ప్రస్తుత వడ్డీ పద్ధతులలో వినియోగించే బదులు వాణిజ్య పద్ధతులలో మదుపు చేసి మరింత వృద్ధి చేయవచ్చును. ఇన్సూరెన్స్‌లో ఈ విధానాన్ని కార్యరూపంలోనికి తెస్తే ప్రపంచం తప్పక దీనిని అనుసరిస్తుందని నాకు ప్రగాఢ విశ్వాసం ఉంది. మనం ఈ వ్యవహారాలను చాలా నీతివంతంగా చాలా పటిష్ఠమైన పునాదులపై నడిపించి చూపిన, ప్రపంచ ప్రజలు అనుసరించకుండా ఉండడం అసంభవం.

## చివరిమాట

చివరగా ఈ వ్యవహారాల జ్ఞానం కలవారితో నేను చేసే విన్నపమేమిటంటే, ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలను ధర్మసమ్మతంగా నిరూపించేందుకు ఇస్లాం ఆదేశాలను, బోధనలను సవరించటం లేదా మార్పు చేసే ప్రయత్నాలను విడనాడాలని కోరుతున్నాను. వాస్తవంగా చేయవలసిన కార్యమేమంటే

ఇస్లాం నియమాలకనుగుణంగా ఒక కొత్త విధానం రూపొందించడానికి మనం పరిశోధన, అన్వేషణల కొరకు శ్రమించాలి. మధ్యప్రాచ్య దేశాల ప్రయాణంలో సౌదీ అరేబియాకు చెందిన ఒక ఆర్థికవేత్తతో పరిచయమైనది. నేను ఆయనతో ఈ నూతన విధానాన్ని దాని రూపురేఖలను మీముందు ప్రస్తావించిన విధంగా ఆయన ముందు ఉంచాను. అందుకు ఆయన "వాస్తవంగా చేపట్టవలసిన కార్యక్రమం ఇదే, దీనిని ఎంతో విజయవంతంగా నిర్వహించగలం. అంతేకాదు తద్వారా ఎన్నో శ్రేయోఫలాలు కూడా లభిస్తాయి" అని అన్నాడు.

మొదట చేయాల్సిందేమంటే వడ్డీ నిషేదాజ్ఞను అమలు చేయడమే. ఇలా చేయనిదే నూతన విధానం విజయవంతంగా నడుపలేము. కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత వడ్డీకి బదులుగా ఆదాయాన్ని పంచుకొనే వ్యవహారమే అధిక లాభాన్ని చేకూరుస్తుందని తెలుస్తుంది. ఇలా చేయకపోతే వారు 'వడ్డీ' లాభాన్ని త్యజించడానికి సుతరాము ఇష్టపడరు. కావున హరామ్ (నిషిద్ధ) మార్గాలను మూసివేయనిదేప్రజలు 'హలాల్' (దర్మసమ్మతమైన) మార్గాన్ని అనుసరించరు. ఇందుకు ఒక చిన్న ఉదాహరణ ఏమంటే రైలు బండిలో టికెట్ లేకుండా ప్రయాణించడం నేరం కానపుడు ఎవరేగాని టికెట్ తీసుకునే శ్రమ తీసుకోరు. కావున మనం మొదట వడ్డీ వ్యాపారాన్ని నిషేధించిన పిదప మన నూతన విధానాన్ని ఆచరణా రూపంలో తేగలం. వాస్తవానికి ఇది ఒక సంధి కాలం లాంటిది. ఏనాడైతే మనం ఆర్థిక వ్యవహారాలలో స్వయంసమృద్ధిని సాధిస్తామో అప్పుడు ఈ సమస్య సమసిపోతుంది. లేదా ప్రపంచం మన ఈ నూతన విధానాన్ని స్వీకరించి స్వతహాగా మనల్ని ఈ 'వడ్డీ' చెర నుండి స్వాతంత్ర్యాన్ని ఇవ్వగలదు. మీరు విశ్వసించండి ఈ సమయం ఆసన్నమవడానికి ఎంతో కాలం పట్టదు.